


# యోగవిద్యా ప్రదర్శనం

శ్రీ కొడవటిగంటి కుటుంబరావు

ఆనాడు జరిగిన యోగవిద్యా ప్రదర్శనానికి నా అంతట నేనైతే వెళ్లి ఉండేవాణ్ణి కాను. నాకు యోగవిద్యా ప్రదర్శనాలంటే అదోక విధమైన ఏవగింపు - కొంచెం భయమున్నూ!

కాని ఒకరిద్దరు స్నేహితులు నిర్బంధించగా నా జీవితంలో మొదటిసారి నేనా యోగవిద్యా ప్రదర్శనం చూడబోయినాను.

ఆ యోగి శక్తివంతుడల్లేనే కనిపించాడు. ఆయన ప్రేక్షకుడి మనస్సులో మాటలు కనిపెట్టటమూ, కాగితం మీద వ్రాసిన ప్రశ్నలు చదవకుండానే సమాధానాలు చెప్పటమూ, గాలిలో తేలటమూ, గుండెను ఆపిచూపించటమూ మొదలైన పనులు నమ్మదగినట్టుగానే చేశాడు.

ఇదంతా చేసి ఆయన ప్రేక్షకులను ఉద్దేశించి "మహాశయులారా! నేను జరపదలుచుకున్న కార్యక్రమంలో ఇంకా ఒక్క పనే దిగబడి ఉంది. అది ఇప్పుడే చేసి చూపుతాను.

"అనేకమంది యోగులు యోగసమాధిలో ఉండిపోయి తమ భౌతిక శరీరాలను అనేక రోజులు భూగర్భంలో సమాధి చేయించుకోగలరు. నేను దాన్ని అట్టే పెద్దపని కింద గణించను. నేను తమకు చూపదలచిన చిత్రం ఏమిటంటే, మీలో ఒకరు ధైర్యంచేసి రండి. అలా వచ్చిన వారిని నేను యోగనిద్రలో ఉంచి పదిహేను నిమిషాల్లపాటు ఆ శరీరాన్ని భూస్థాపనచేసి చూపుతాను. చిత్తగించండి.

"మీలో ఎవరైనా ధైర్యంచేసి వస్తారా?" అన్నాడు.

ప్రేక్షకుల్లో ఎవ్వరూ ఎటువంటి శబ్దమూ చెయ్యలేదు. "ఎవరైనా ధైర్యంచేసి వస్తారా?" అనే యోగిమాటలు, ఫోటోలో దిగి శాశ్వతం చేయబడిన ఛాయమాదిరిగా, ఆ హాలులో ఉన్న గాలిలో శాశ్వతత్వం పొందినట్టుగా అనిపించింది.

నాలో మాత్రం ఒక విధమైన ఉద్రేకం ఉద్భవించింది. నేనెందుకు భూస్థాపితం కాకూడదూ? ఒక్కటే ఆశ - నా ప్రాణం అట్లాగే పోవచ్చును!

ఎప్పటికైనా చావు ఉండనే ఉంది - బాధతో కూడిన చావు. ఇది చాలా సునాయాసంగా అయిపోయే పని. ఒకవేళ చావనూ, నా ధైర్యానికి నన్నంతా మెచ్చుకుంటారు. ఈ అనుభవం ఏమిటో చూడవచ్చును.

నన్నా రోజుల్లో ఎరిగినవారికి తెలుస్తుంది నాకు ప్రాణం మీద అంతవిరక్తికి కారణం ఏమై ఉండిందో, నా జీవిత

మంతా యుద్ధమే అయిపోయింది. మనుష్యులతో కానివ్వండి. పరిస్థితులతో కానివ్వండి, మొత్తంమీద విధితో కానివ్వండి. నేను ఏమాత్రపు అల్పసుఖం అనుభవించాలన్నా ఒకమనిషో, ఒక పరిస్థితో నాకు అంతరాయంగా ఉంటూ ఉండేది. దానితో పెద్దయుద్ధంచేసి ఆ అల్పసుఖం అనుభవించవలసి వచ్చేటప్పటికి నాకు అందులో ఆనందం కనిపించేదికాదు. నేను అనేకమందిని అసంతృప్తిపరచటం ఎందుకులే అని అనుకున్న క్షణాన అనేకమందివల్ల నేను అసంతృప్తి పొందవలసిన అవసరం కలిగేది. నేనేం చెయ్యను? నా జాతకమే అంత!

అన్నిటినీ సహించటం నేర్పింది నాభార్య. లోకం నన్ను పెట్టినహింస యావత్తూ నాభార్యముఖం ఒక్కసారి చూసి మరిచిపోగలిగేవాణ్ణి. నా హృదయంమీద గాయాలన్నీ మచ్చలేకుండా మరుక్షణమే మాయమై పొయ్యేవి ఆవిడచెయ్యి నా గుండెమీద ఒక్కసారి నిమిరినట్టయితే. ఆ ఒక్కవ్యక్తే ఈ ఘండాలపు ప్రపంచాన్ని వాసయోగ్యంగా చేసింది. అటువంటి నాభార్య అప్పటికే సంవత్సరంక్రితం ఒక ఆడపిల్లను కని బాలింతరోగంతో చచ్చిపోయింది.

ఇక నాకు జీవితంతో ఏంపని? నేను వెళ్లి నా భార్యను కలుసుకోవటంకన్న నాకు కావలిసిందేమిటి? నాభార్యను ఎప్పుడైతే తీసుకుపోయిందో అప్పుడే ఆ మృత్యుదేవత నాకు ఆప్తురాలయింది. నాకు ఆవిణ్ణిచూస్తే ఏం భయం?

నేను ఒక్కపరుగున యోగిదగ్గిరికి వెళ్లి "నన్ను సమాధి చెయ్యండి!" అన్నాను. యోగి నావంక చాలా సంతోషంతో చూసి, ప్రేక్షకులవంక తిరిగి, "అయ్యా, చూశారా? నేను చేసినపనులకు మీరంతా ఆనందవిస్మయాలు మాత్రమే చూపారు. మీరు చప్పట్లు చరిచికూడా నాకు చెయ్యనికాంప్లిమెంటు ఈ యువకుడు నాకు చేశాడు. ఇతను నాయందు విశ్వాసం చూపించాడు. నేను చాలా సంతోషించాను!" అన్నాడు. పాపం, ఆయనకేం తెలుసునూ, నేను చావాలని ప్రార్థిస్తున్నాననీ, ఆయన శక్తియందు విశ్వాసం లేకుండా ఉండాలని ప్రయత్నిస్తున్నాననిన్నీ?

యోగి నన్ను ఒక బల్లమీద పడుకోబెట్టి హిప్నొటైజు చెయ్యటం మొదలుపెట్టాడు. నేనుకూడా నిద్రపోదామనే ప్రయత్నంలో ఉండటంవల్ల నాకు త్వరలోనే మైకం వచ్చేసింది. నేనా మైకంలో ఎంతసేపున్నానో తెలియదు. నాకు అకస్మాత్తుగా ఒళ్లుతెలిసింది. యోగి గారి యోగశక్తి నామీద పనిచెయ్యలేకపోయినందుకు చింతించాను. మళ్లా ఆయన్ను పిలిచి ఇంకొకపర్యాయం హిప్నొటైజు చెయ్యమని అడుగుదామని ఆయనకోసం తల కొంచెం ఎత్తి చూశాను. ఆయన నాకు వీపుపెట్టి ప్రేక్షకులతో మాట్లాడుతున్నాడు.

"ఇప్పుడీ బల్లమీదఉన్న శరీరం వట్టి కట్టె. ఎవరైనా వచ్చి ఈ కళేబరాన్ని పరీక్షించుకోవచ్చును. డాక్టరుగారూ, మీరు దయచేసి ఇతణ్ణి పరీక్షించి ప్రాణం ఏమయినా ఉందేమో చెప్పండి!" అంటున్నాడు యోగి.

నేను లోలోపల నవ్వుకుంటూ, "అయ్యా, యోగీశ్వరులుగారూ, దయచేసి మీ ఫీటు మళ్లీ ప్రారంభించండి అంతా మంట గలిసింది!" అని అరిచాను.

కాని నేను మాట్లాడటం మొదలుపెట్టగానే అందరూ చప్పట్లుకొట్టటం మొదలుపెట్టి ఎంతసేపటికీ ఆపకపోవటంవల్ల నామాటలు యోగికి వినిపించలేదేమో. ఆయన నావంక చూడలేదు.

ఈలోపల డాక్టరుగారు కుర్చీలోనించి లేచి స్టేజియెక్కరావటం మొదలుపెట్టాడు. నేనిక సహించలేక లేచి కూర్చుని, "మీరు పెద్దపరీక్ష చెయ్యనవసరంలేదు. నేనింకా జీవించే ఉన్నాను. మీకు చత్వారంలేకపోతే అది స్పష్టంగా కనిపిస్తుంది!" అన్నాను. కాని ఆయన గుడ్డివాడే కాక చెవిటివాడుగాకూడా కన్పడ్డాడు. ఆయన నా దగ్గిరికి రాసాగాడు. ఆయనకు మతిపోయిందేమో అనుకున్నాను. అందరు ప్రేక్షకులకూ పోయిందామతి? లేక ఈ గారడీవాడు అందరికీ కనుకట్టు చేశాడా?

నాకిక అక్కడ ఉండటం అసహ్యంవేసింది. నేను చివాలున లేచి హాలుబయటికి పరిగెత్తుకుని వచ్చి రోడ్డుమీద పడ్డాను.

రాత్రి పదకొండు గంటలవుతుంది. రోడ్డు నిర్మానుష్యంగా ఉంది. నేను మెల్లిగా ఇంటివైపు నడవటం మొదలుపెట్టాను. లోకం ఎంత దగా ఖోరుగా ఉందా అని ఆశ్చర్యపడుతూ. మోసం, కపటం - వీటిదీ రాజ్యం!

ఇంతలో దూరాన్నుంచి ఒక పెద్ద కోలాహలం నా చెవిన పడ్డది. క్రమంగా ఆ కోలాహలం పెద్దదయింది. ఆడ గొంతులూ మగగొంతులూ వినిపించినై. ఏదో ముఠా. అటువంటి ముఠాలు మా వూళ్లో బయలుదేరే సమయమే అని. వాళ్లు నావైపే రావటం నాకాటే యిష్టంలేకపోయింది. ఏపక్క సందునో పడిపోదామని చూస్తుండగా ఆగుంపు పక్కసందు మలుపుతిరిగి నాకేసి రావటం మొదలుపెట్టింది. వాళ్ల అల్లరికి నా చెవికి తడికలు కట్టినెయ్యాంటే నమ్మండి.

నేను రోడ్డుమీద ఒకపక్కకు ఒదిగి ఆ గుంపుకు దారి ఇచ్చాను. కాని వాళ్లుమాత్రం నన్నంత సులభంగా వదలదలచలేదు, అంతా నన్ను చుట్టు ముట్టి, "ఎప్పుడు విడదల అయినావు, తమ్ముడూ! ఎక్కువ బాధపడ్డట్టు లేదే చూస్తే! మట్టివాసన కొడుతున్నాడు! కాదు పిల్లా?" అని గోలగా మాట్లాడటం మొదలుపెట్టారు.

వాళ్లలో ఒక పొడుగాటి అందమైన కుర్రవాడు అందర్నీ తోసి ముందుకువచ్చి, రెండుకాళ్ళూ ఎడంగా పెట్టి నిలబడి నావంక చిత్రంగా చూడటం మొదలుపెట్టాడు. నాతో మాట్లాడింది వాడేనని ఊహించాను. అయేఉండాలి, ఎందుకంటే మరుక్షణమే వాడి "పిల్ల" కూడా అందర్నీ తోసుకుని వచ్చి వాడి పక్కనే నిలబడి నావంక చూడటం మొదలుపెట్టింది.

నేను ఒక్కక్షణం నా కళ్లను నమ్మలేకపోయినాను. ఆ "పిల్ల" నా భార్య! "లక్ష్మీ!" అని ఒక్క కేక పెట్టాను.

అది నావంక మొహం చిటచిటలాడిస్తూ చూసి, "నన్ను లక్ష్మీ గిక్ష్మీ అని పిలవ్వాకు! మర్యాదగా ఉండదు. నీ మొహంచూస్తేనే నాకు మండుతున్నది. నేను అసమర్థపు ముండనై నీకు ఎంత వెట్టిచాకిరి చేశాను! నా ఆత్మను ఎట్లా చంపుకున్నాను. అదంతా నువ్వు ఆనందించావు. నాకిచ్చిన బహుమతి ఏమిటీ? నీఅంత మంచి పెళ్లాం ఉండదన్నావు. పాడు వెధవా? అప్పుడే నిన్నుచూస్తే నాకు లోపల భగ్గుమండేది. నన్ను ఒక్కనాడు సుఖపెట్టావా? నాసుఖం ఏమిటో కనుక్కోవాలనన్నా చూశావా? ఛూ!" అన్నది.

"ఓసి దయ్యంముండా! నీకోసం ఎంత ఏడిచానే! నీ ప్రకృతి కనుక్కోలేక పోతినిగదే!" అని నేను దాన్ని తిట్టటం మొదలుపెట్టాను. దాని ఉద్రేకం చూసి నవ్వని ఆ జనం నా ఉద్రేకంచూసి నవ్వటం మొదలుపెట్టారు.

నాకొక ఆలోచనవచ్చి శరీరం వణికింది.

"అయితే మీరంతా దయ్యాలేనా ఏమిటి, కొంపతీసి!" అన్నాను.

"ఓహోహో! ఆహాహా! ఈహీహీ!" అని అందరూ నవ్వటం మొదలు పెట్టారు.

"మీకేం పొయ్యేకాలంవచ్చింది, అట్లా నవ్వటానికీ?" అని అడిగాను.

నా ఎదురుగా నిలబడ్డ కుర్రవాడే సమాధానం చెప్పాడు. దయ్యం అయితే అయినాడు, నా పెళ్లాన్ని కాజేస్తే కాజేశాడు - అసలా అంటుముండ నా కింకెందుకుగాని - అందరిలోకీ తెలివిగలవాడూ పెద్ద మనిషీ వాడే నంటాను.

"నువ్వూ ఇప్పుడు మాలోవాడివే! అందుకని నువ్వు మమ్మల్ని దయ్యాలంటుంటే మాకు నవ్వువచ్చింది," అని వాడు నాకు తెలియజేశాడు.

"నేను నమ్మను!" అన్నాను.

"మేమూ మొదట నమ్మలేదు. అడుగో ఆవచ్చే మనిషిని చూడు. వాడికీ మనకూ ఉన్న భేదాలు గమనించు నీకే అంతా అరమౌతుంది!" అని వాడు సమాధానం చెప్పాడు.

ఆ దారివెంట ఒకడు నడచివస్తున్నాడు, కాళ్లీడ్చుకుంటూ తలకాయ వంచుకుని. వాడి నడకకూ మా నడకకూ

ఏంతో భేదం ఉంది-ఆకుపురుగుకూ అందులోనించి వచ్చిన రెక్కపురుగుకూ ఉన్నంతభేదం ఉంది వాడికీ మాకూ. /

అయితే నే నెప్పుడు చచ్చిపోయి వుంటానూ? ఆ యోగీశ్వరుడు నన్ను చంపే ఉండాలి - చేతకాని 'అప్రాశ్యపు కుంక!'

నా కిప్పుడు చావాలని లేదు మరి! నాపెళ్ళాంయొక్క నైజం బోధపడటంవల్లనో ఆ దయ్యపుబతుకు ఇష్టంలేకనో నాకిప్పుడు జీవింతామనే ఉంది.

అయిన పనేదో అయిపోయింది. ఇప్పుడే మనుషని ఏం ప్రయోజనం? మా నాన్న అయినా కనిపిస్తే బాగుండును. ఆయన ఎక్కడ ఉంటాడని అడిగాను. వాళ్లెవరూ ఎరగరు.

"ఆయన బహుశా చచ్చిపోయి ఉంటాడు!" అని ఆ కుర్రవాడు ఊహించాడు.

అవును, అందుకనే అడుగుతున్నాను! మనమంతా చచ్చిపోయినవాళ్లమేగా!"


"కాదు!" అన్నాడతను గర్వంగా. "మనమంతా బలవంతంగా చంపబడ్డవాళ్లం. మన జీవితమంతా బతికిఉన్నవాళ్ల మధ్యే గడపవలిసి ఉంది. మనసుఖమంతా - ఇంత ఎందుకు? మాతోరా! వెళ్లి జల్సా చేద్దాం. నేనూ లక్ష్మి రహదారి బంగాళాకు పోతున్నాం. అక్కడ కొత్తగా పెళ్లి అయిన దొరా దొరసానీ ఉన్నారు రాత్రంతా వినోదంగా వుంటుంది. సుఖం దొరలు ఎరిగినట్టు మనవాళ్లే మెరుగుదురు. ఆలస్యం అవుతున్నది. మేం పోవాలి! అంటూ ఆ కుర్ర వాడు లక్ష్మిని రెక్కపట్టుకుని రహదారి బంగాళా వైపు మాయమై పోయినాడు.

నేను చూస్తూండగానే ఆడవాళ్లూ మగవాళ్ళూ జంటలు జంటలుగా మాయమైనారు. పీడ వదిలిందిగదా అని సంతోషిస్తూ ఉండగా ఒకముసలిముండ వచ్చి నా చెయ్యిపట్టుకుని "రా పోదాం మనంకూడా!" అని నన్ను లాగింది.

"నేను రాను పో!" అని దానిపట్టు విడిపించుకోజూశాను. కాని దానిది దయ్యపుపట్టు.

"నీకేమీ తెలియదు. నేను నేర్పుతాను రా! అని నన్ను లాక్కుపోసాగింది.

దానికి నాతో పనిఏమిటో స్పష్టంగా నాకు అర్థం కాలేదు. అది నన్ను ఇల్లిల్లూ తిప్పటం మొదలుపెట్టింది. ఆనాడు దాని కర్మమేమిటో ప్రతిఇంట్లోనూ అంత నిద్రపోతూనే ఉన్నారు. దానికేమో నిద్రపోతున్నవాళ్లను చూస్తే ఇష్టం ఉన్నట్టు కనిపించలేదు. అది వాళ్లను తిట్టి



వాళ్లమీద ఉమ్మేసి నన్ను మరొక ఇంటికి లాక్కుపొయ్యేది.

ఒక పడకటింటో భార్యాభర్తా మేలుకునే ఉన్నారు. నిద్రపోబోతున్నట్టు కనపడ్డారు.

ముసలిదయ్యం ఒక్కముక్కుముక్కి "ఇక్కడ అంతా అయిపోయింది. ఇంకోచోటికి పోదాం పద! అని నన్ను ఈడ్చుకుని పోయింది.

ముసలిముండకు ఇంత యావా అని నేను ఆశ్చర్య పడ్డాను. యావ అనేది శరీరానికి సంబంధించినది కాదు వయస్సుకు సంబంధించినదేనని ఊహించుకున్నాను.

చివరకు ఒక ఇంట్లో ప్రవేశించాం. ఆ ఇంటికంతా ఒక భార్యా ఒక భర్తామాత్రమే ఉన్నారు. ఇద్దరూ విశాల



మైన సావడిలో రెండుమంచాలు వేసుకుని నిద్రప్రయత్నం లేకుండా ఎవరి పక్కమీద వారు కూర్చున్నారు. మగవాడు దీర్ఘ విచారంలో మునిగివున్నట్టు కనిపించాడు. దీపంజ్యోతి లాగా వెలుగుతున్నది.

ముసలిది నన్ను భుజంమీద తట్టి "నువ్వువెళ్లి మగవాణ్ణి ఆవేశించు, నేను ఆడదాన్ని ఆవేశిస్తాను. ఇద్దరికీ ఉద్రేకం కలిగించి ఆనందించుదాం. ఆ తరవాత ఇక్కణ్ణించి ఇంకో చోటికి పోదాం" అన్నది.

"నీ ఆవేశం నే నెరగను పో!" అన్నాను.

"నన్నుచూడు!" అని అదివెళ్లి నాకళ్ళఎదట నిర్భయంగా ఆ స్త్రీ శరీరంలోఎక్కి కూర్చుంది. నాకాముండను మాస్తే భయంవేసింది.

ఆ ముసలిది ఎప్పుడయితే ఆవహించిందో ఆక్షణమే ఆభార్య తలఎత్తి భర్తవంక చూసింది. ఆ కళ్ళలోకి అదొక ఉద్రేకంవచ్చింది. ఆమె ముసలి దానిబరువు మొయ్యలేకుండా ఉందేమో అన్నట్టు మెల్లిగా లేచి తల వంచుకుని మంచంమీద కూర్చున్న భర్త భుజంమీద మెల్లిగా చెయ్యి వేసింది

పాపం, ఆ భర్త చాలా దీనంగా భార్యవంక చూసి, "ఇప్పుడా! అన్నాడు, భార్య నవ్వింది.

"మా అమ్మ శరీరం ఇంకా దహనంకూడా కాలేదు. నాకోసం అట్లాగే ఉంచారు! ఇంకొక రెండుగంటల్లో బయలుదేరబోతున్నాం మెయిలు బండిలో! ఇదా సమయం!" అన్నాడతను. ఈమాటలకు నాహృదయం తరుక్కుపోయింది.

"మళ్ళీ ఎప్పటికో! ఏం అనుభవించినా ఈ రెండుగంటలే కద! రండి!" అన్నది భార్య మదించిన గొంతుతో. ఆమె శరీరంమీద బట్టకూడా నిలవటంలేదు.

"ఓరి చచ్చుపెద్దమ్మా! మగవాణ్ణి ఆవహించు!" అని ముసలిది కేకపెట్టింది. నేను వినిపించుకోలేదు.

మొగుడికి కోపంవచ్చింది. "నీకు మతిపోయిందా? ఇంత కాలమూ నీమాట విని మా అమ్మను నిరసించినందుకు నేను లోపల ఎంతబాధ పడుతున్నానో నువ్వు ఒక్కరవ్వయినా గ్రహించలేక పోయినావు. నేను నామాటంట అది రానివ్వక పోయినందుకు నువ్వు నన్ను మెచ్చుకోలేక పోయినావు. నా మంచితనం నీమీద వృథా అయిపో

యింది. నేను నిన్ను ఎన్నడూ ప్రేమించలేదు. నాకు ఎప్పుడూ మా అమ్మమీద నే ప్రేమ. ఆవిడ నన్ను క్షమించింది. నువ్వు నన్ను ఓర్చనైనా లేదు! ఆమాట అని అతను ఏడవటం మొదలుపెట్టాడు.

భార్య గర్వంతో నిటారుగా నిలబడి మూతి విరిచి తన పక్కమీద పడుకుని అతనికి వీపుపెట్టి నిద్రనటించటం మొదలుపెట్టింది. ముసలిదిమాత్రం ఆమెను వదలలేదు.

ఈ లోపుగా నేనువెళ్లి అతనిభుజంమీద చెయ్యివేసి, "దుఃఖించకు, నాయనా! మీ అమ్మ నిన్ను తప్పకుండా క్షమిస్తుంది. ఆ విడ ఆత్మ ఈక్షణం ఇక్కడవుంటే -" అని ఆగాను.

నన్ను ఎవరో అమృతహస్తంతో స్పృశించినట్టయింది. నా చెవిలో ఎవరో రహస్యంగా "మా వాడికి వుపశమనం కలిగించు, నాయనా! నాకన్న వాడికి నువ్వుదగ్గిరగా ఉన్నావు. వాడిమీద నాకు కోపంలేదు, వాణ్ణి నేను కని పెట్టే వుంటాను. చెప్పు, వాడితో చెప్పు! అన్నట్టయింది.

నా శరీరం పులకరించింది. నేనా మాటలన్ని అతనితో అన్నాను. అతనికి నామాటలు వినపడ్డట్టే తోచింది. అతను క్రమంగా తెప్పరిల్లుకున్నాడు. అతని మొహంలోకి ఒకవిధమైన వికాసంవచ్చింది. అతను తల పైకెత్తి ఒక్కసారి "అమ్మా!" అన్నాడు. నేనంతకంటె మధురమైనశబ్దం ఎన్నడూ వినలేదు.

మరుక్షణం అతనితల వాలిపోయింది. అతను మంచం మీద ఒరిగి సుషుప్తిలోపడి పోయినాడు.

నా కక్కడ ఇంకేంపని? ఆ భార్యను ఇంకా రెచ్చగొట్టాలని చూస్తున్న ముసలిదయ్యాన్ని రెక్కపట్టుకు లాగాను. "రా, పాపిష్టిముండా! ఇక్కడ ఇంకొకసారి అడుగుపెట్టితే మారణహోమం చేస్తాను!" అని దాన్ని బెదిరించాను.

ముసలిది ఇవతలికి రాగానే ఆ భార్యలో కలిగిన మార్పు వర్ణనాతీతం. ఆమె కలగని మేలుకున్నదానల్లే లేచి నిద్రపోతున్న భర్తదగ్గిరికివెళ్లి అతని కాళ్లదగ్గిర నేలమీదకూర్చుని మంచంమీద అతని కాళ్ళదగ్గిరగా తలపెట్టి నిశ్శబ్దంగా ఏడుస్తూ, "క్షమించండి!... నాకు ఒళ్లు తెలియలేదు. మీ అమ్మగారికోసం క్షమించండి!" అని గొణగటం మొదలుపెట్టింది.

నే నక్కడ ఉండలేక ముసలిదాన్ని యీడ్చుకుంటూ బయటికి వచ్చాను.

"నీదీపమారిందిగదరా!" అని తిట్టి అది ఎటోమాయమైంది.

నేను తలవంచుకుని ఎటో నడవటం మొదలుపెట్టాను. ఇంతలో నన్నెవరో పిలుస్తున్నట్టయింది. నేను వినిపించుకోలేదు. కాని ఆ పిలుస్తున్న మనిషి ఎంతో ఆదుర్దాలో ఉన్నట్టు కనిపించింది. తలఎత్తి చూశాను. యోగి నాకేసి పరిగెత్తుకుంటు వస్తున్నాడు.

ఆయనదగ్గిరికి రాగా నే "ఇదేమిటి? నువ్వుకూడా -" అన్నాను.

"భలే! మంచిపని చేశావులే! ఆపక్కనే ఉండక ఎక్కడికిట్లావచ్చావు. నా ప్రతిష్ట కాస్తా మంటగలపమూస్తున్నావా? పద, పద! నీ శరీరంలో ప్రవేశించు. ఇరవైనిమిషాలు దాటుతున్నది. నేను నిన్ను చంపానని కొందరు సందేహించటం మొదలుపెట్టారు."

"నేను రాను. ఆ శరీరం తగలేయించు," అన్నాను.

"మా బాబుగాదూ! మా నాయనగాదూ! రా! లేకపోతే నన్ను బతకనివ్వరు!"

"నేను రానన్నానని చెప్పు. నేను కులాసాగా ఉన్నానని కూడా చెప్పు!"

"ఎక్కడైనా కద్దా? ఎవడైనా నన్ను నమ్ముతాడా? నన్ను ఉరితీసేస్తారు!"

"అయితే నువుకూడా ఇక్కడే ఉండు!"

"అమ్మో! నాకింకా బతుకుమీద ఆశతీరలేదు. మా అమ్మాయి పెళ్లిచెయ్యాలి. నా భార్యా ఇంకా పడుచుది. సంసారసుఖం వదిలిపెట్టిరానా!"

"సంసారసుఖం ఇక్కడాఉంది! నీకు చావటం ఎంత అయిష్టమో నాకు బతకటం అంతకు పదింతలు అయిష్టం!"

"కావాలంటే నువ్వు ఆత్మహత్యచేసుకో, ఒకసారి నీ శరీరంలో ప్రవేశిస్తే నా బాధ్యత తీరిపోతుంది."

"నేను రాను, నాకు ప్రపంచంలో ఏమీలేదు. అంత చేతకాని యోగవిద్యా ప్రదర్శనం ఎందుకు చేశావు? అనుభవించు!"

"ప్రపంచంలో నీకేంలేదూ? అన్నీ ఉన్నై? నీకేం కావాలి చెప్పు!

"ప్రేమ! ప్రేమ! ప్రేమ!" అని గట్టిగా అరిచాను.

"నా కదీ కావాలిసింది! తెలిసిందా? ప్రేమ ఎట్లా ఉండేదీ ఇప్పుడే చూశాను. నాకు ప్రపంచంమీద ప్రేమ ఎక్కడ దొరుకుతుందో చూపించు, వస్తాను!"

మళ్ళీ నన్ను ఎవరో అమృతహస్తంతో స్పృశించినట్టయింది. నా శరీరం జలదరించింది. ఆస్పర్శను గుర్తించగలిగాను. నన్ను మొదట ఆ ఇంట్లో ముట్టుకున్నవ్యక్తే నాచెయ్యిపట్టుకుని నన్ను తీసుకుపోనారంభించింది. ఆ ముసలిదయ్యం లాక్కుపోవటానికీ దీనికీ ఎంతభేదం.

కొద్దిసేపట్లో నేనేనూ, నాకు అదృశ్యంగా ఉండి నాకు దారితీస్తున్న దేవతా, మావెంట యోగీ - ముగ్గురమూ మా మేనమామగారిల్లు ప్రవేశించాం, మా మేనమామ కూతురు సుందరి పడుకున్నచోటికి వెళ్ళాం. మా అలికిడి విని లేచి కూర్చున్నట్టు సుందరి మంచంమీద లేచి కూర్చున్నది, సుందరియొక్క సూక్ష్మశరీరమేననీ, దాని భౌతికశరీరం పక్కమీద పడుకుని ఉన్నదనీ ఈసారి జాగ్రత్తగా గమనించాను.

సుందరి నన్ను చూస్తూనే మంచంమీదినించి ఒక్క ఎగురు ఎగిరి నామీదవాలి "నాకోసం వచ్చావా, బావా? ఎన్నాళ్లకూ!" అన్నది.

సుందరి భర్తతో నాలుగేళ్లు కాపరంచేసి, వైధవ్యం పొందింది. దానికి నామీద ప్రేమవున్నదని నాకు ఎన్నడూ అనుమానమైనా పోలేదు. దాన్ని పెళ్లి చేసుకోవాలని నాబోటి శిష్టాచారసంపన్నుడికి తట్టలేదని వేరే చెప్పనక్కర్లేదు.

యోగి నన్నుతట్టి "నీ ప్రేమస్థానం చూపించానా? ఇప్పుడైనా వస్తావా?" అన్నాడు.

నేను నవ్వాను. మరొకనవ్వు నా నవ్వులో కలిసినట్టయింది. ఏమినవ్వు! యోగి అమాయకత్వానికి నవ్విన ఆ నవ్వుకూడా ఎంత మార్దవంగా కరుణతో కూడుకువుంది!

నా చేతిని పట్టుకున్న ఆచేతిని నా రెండు చేతితో స్పృశించి "అమ్మా!...శిలవు! అన్నాను. మరొకచెయ్యి నా ఫాలాన్ని స్పృశించింది. అంతే! ..

యోగి నన్నుక్కణ్ణించి గబగబా యోగవిద్యా ప్రదర్శనం జరిగినచోటికి తీసుకువచ్చాడు. నా శరీరమూ, సమాధిలో కూర్చున్నట్టున్న యోగి శరీరమూ కనిపించినై!

* * *

సుందరి ఇప్పటికికూడా అంటూవుంటుంది. ఆరాత్రి నేను తనకు కలలో కనిపించానని ఆ యోగి నాకు మళ్ళీ కనిపించాడు. ఆ రాత్రి జరిగినవిషయం ఆయనకూ ఏమీ జ్ఞాపకంలేదు.

నాకూ సుందరికీ ఆ విషయాలు అంత మరుపురాకపోవటానికి కారణంఎవరో నే నూహించగలను.





భృంగామలకతైలము

1 ఔన్సు మాదిరి బుడ్డి $2\frac{1}{2}$ అణాలు.

6 ఔన్సు బుడ్డి 12 అణాలు.

నంజగూడు పండ్లపొడి

I.D.L.61. ముడికలిడే

యునైటెడ్ కన్సరన్, ... మదరాసు

౨ అ. 6 ప్యాకెట్టు. తపాలాచార్జీ ఉచితము

పోల ఏజెంట్లు: యునైటెడ్ కన్సరన్, బందరువీధి, మద్రాసు.

కాకినాడ, సూర్యారావుపేట, లక్ష్మీనారాయణకంపెనీ,

రాజమండ్రి, అరవరామస్వామి అండ్ సన్సు,

బందరు, ఆనందాఫార్మసీయొద్దను దొరుకును.